# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 187 | మంగళవారం, 09 జూన్ 2026 | పేజీలు : 4




## నేడు ఘన్‌పూర్‌కు డిప్యూటీ సీఎం భట్టి

**ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఈ నెల 9వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో... సభ స్థలం వద్ద చేయాల్సిన ఏర్పాట్లను స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం పరిశీలించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 60.62కోట్ల విలువైన 7 విద్యుత్ సబ్ స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న సందర్భంగా.. చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చర్చించారు. ఈ సందర్భంగా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల అనంతరం సుమారు 6వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్టేజ్ పైన, సభా ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.... 60.62కోట్ల విలువైన సబ్ స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి మొట్ట మొదటి సారి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి వస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఘనంగా స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వేలేరు మండలం పీచరలో 132/33 కేవి సబ్ స్టేషన్, చిల్పూర్ మండలం కొండాపూర్, జఫర్ గడ్ మండలం సాగరం, రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామాలలో 33/11కేవి సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం మరియు చిల్పూర్ మండలం లింగంపల్లి, పల్లగుట్ట, నష్కల్ గ్రామాలలో 33/11కేవి సబ్ స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమర్క శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఒకే రోజు ఒకే చోట 7సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు జరుగుతున్న సందర్భంగా నియోజకవర్గ రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రక్షణ కమిటీలో భక్షకులు ఎవరో?!


జనగామ, మన చౌరాస్తా : జనగామ జిల్లా కలెక్టర్ బాధిత రక్షణ కమిటీలో కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. న్యాయం చేస్తామని ముందుకు వచ్చిన వారే ఆ విషయాన్ని మర్చిపోయి.. అన్యాయం చేశారంటూ బాధితులు లోలోపల కుమిలిపోతున్నట్లు సమాచారం. బాధితులకు అండగా ఉండాల్సిన రక్షణ కమిటీ సభ్యులపైనే అక్రమ వసూళ్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

*- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా*

2

## న్యాయం చేస్తామంటూ అక్రమంగా వసూళ్లు చేశారట!

- లోలోపల కుమిలిపోతున్న బాధితులు..
- మీడియా ముందుకు వచ్చేందుకు నిరాకరణ






## ఓటరు సవరణపై జాగ్రత్తగా ఉండాలి

- బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీకి సైనికుల్లా పనిచేయాలి
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి
- వరంగల్‌లో నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సు

4 లో

## సొంతింటి కల సాకారమే లక్ష్యం


- జడ్పీ సీఈవో రంగారావు
- బండనాగారంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



4 లో

# రక్షణ కమిటీలో భక్షకులు

# ఎవరో?!




## న్యాయం చేస్తామంటూ..

## అక్రమంగా వసూళ్లు చేశారట!

- లోలోపల కుమిలిపోతున్న బాధితులు..
- మీడియా ముందుకు వచ్చేందుకు నిరాకరణ

(ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా )

జనగామ జిల్లా కలెక్టర్ బాధిత రక్షణ కమిటీలో కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. న్యాయం చేస్తామని ముందుకు వచ్చిన వారే ఆ విషయాన్ని మర్చిపోయి.. అన్యాయం చేశారంటూ బాధితులు లోలోపల కుమిలిపోతున్నట్టు సమాచారం. బాధితులకు అండగా ఉండాల్సిన రక్షణ కమిటీ సభ్యులపైనే అక్రమ వసూళ్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలను పరిష్కరిస్తామని, న్యాయం చేస్తామని చెప్పి కొందరి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారంపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ బహిరంగంగా మాట్లాడేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతీకార చర్యలు లేదా ఇతర ఒత్తిళ్ల భయంతో వారు మీడియా ముందుకు రావడానికి నిరాకరిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలనే డిమాండ్ కూడా బలంగా వినిపిస్తోంది.

### అసలు ఏం జరిగింది..?

జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టరేట్ ప్రాంగణ గోడను అనుకుని ఉన్న డబ్బాలను తొలగించాలని అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో బాధితులు ప్రజా సంఘ నాయకులు, మేధావులను న్యాయం చేయాలని ఆశ్రయించారు. విషయం కోర్టు వరకు వెళ్లారు. కానీ న్యాయస్థానం అధికారుల చర్యలను సమర్థించింది. దీంతో జనగామలోని కొందరు నాయకులు దీనికి రాజకీయ రంగు రుద్దడంతోపాటు కలెక్టర్ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడని తక్షణమే చర్యలు తీసుకొని బదిలీ చేయాలని దాదాపు సీఎం స్థాయి నాయకులు కలిసి వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్ బాధిత సంఘాన్ని ఏర్పాటు చేశారు.

### ఇక్కడే మొదలైంది..!

కలెక్టర్ చర్యలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తామని, ఆయన బదిలీ తప్పదని, న్యాయం చేస్తామని సందెట్లో సడే మియాలా కొందరు అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డట్టు జిల్లా వ్యాప్తంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కొందరు బహిరంగ బహిరంగంగా చర్చిస్తున్నప్పటికీ కొందరు 'గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్టు' అన్న చందనంగా తయారైంది. కమిటీలోని బాధ్యులే వసూళ్లకు పాల్పడింది 'నేను కాదు.. వాడే..' 'మనం కాదు.. వారే..' అని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నట్టు సమాచారం. మొత్తానికి ఈ మొత్తం తతంగంలో బలైంది మాత్రం బాధితులే అని అర్థం అవుతోంది.

### ఆ కమిటీపై విచారణ జరపాలి



జనగామ కలెక్టర్ పై కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు. న్యాయం పేరుతో నిరక్ష్యరాస్యులైన బాధితులకు అన్యాయం చేశారు. వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వినిస్తున్నాయి. కలెక్టర్ బాధిత సంఘం పేరుతో ఏర్పాటు చేసిన కమిటీపై విచారణ జరపాలి.

*- గండి నాగరాజు, సోషల్ సర్వీస్*

### కలెక్టర్ ఆరోపణలు సరికాదు



జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై కొందరు కావాలని ఆరోపణలు చేస్తున్నారు. కలెక్టర్ వద్ద తమ పైరవీలు సాగడం లేదనే వారు అలా చేస్తున్నారు. కానీ జనం కలెక్టర్ సేవలను మెచ్చుకుంటున్నారు. ఆయన కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉంది.

*- అనిల్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు*

---

## వావ్.. 'ఇవా కిడ్స్'



**హనుమకొండ, మన చౌరాస్తా:** హనుమకొండలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన "ఇవా కిడ్స్ కళా ప్రదర్శన-2026" సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇవా స్కిల్ షేర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక ప్రదర్శనలో 6 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల 40 మంది చిన్నారులు తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు రూపొందించిన చిత్రాలు, పెయింటింగ్‌లు, కళాకృతులు, చేతిపనులు సందర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ప్రదర్శనను సందర్శించిన ప్రముఖులు, కళాకారులు చిన్నారుల ప్రతిభను అభినందించారు. చిన్నారులలో కళా నైపుణ్యాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శనను నిర్వహించినట్లు నిర్వాహకులు హిందుప్రియ, అఖిలేష్ తెలిపారు. కళాఖండాల ప్రదర్శనతో పాటు పలు ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రదర్శన ద్వారా వచ్చిన ఆదాయంలో 70 శాతం చిన్నారులకే అందజేయగా, మిగిలిన 30 శాతాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## సర్కార్ బడుల్లో అన్నీ ఫ్రీ..

- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
- గ్రామ సర్పంచ్ లలిత రఘు




**నల్లబెల్లి, మన చౌరాస్తా:** మండలంలోని నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత రఘు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరంనుంచి ఉదయం అల్పాహారం కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు కూడా అందిస్తారని చెప్పారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల మోజులో పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ బడి కన్నతల్లి లాంటిదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధికి తాము కూడా బాధ్యత వహిస్తామని, దాతల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి, మద్ది మేడారం జాతర చైర్మన్ పబ్బు రాజేష్, పంతులుపల్లి ఉపసర్పంచ్ కదురు నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రాంమూర్తి, ఉపాధ్యాయుడు కునమల్ల రాజన్ బాబు, గ్రామ పెద్దలు ఎరుకల రఘున, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.






రాజమహేంద్రవరం పట్టణంలో పుట్టి పెరిగిన విక్రమ్‌కి హైదరాబాద్‌లో IT ఉద్యోగం వచ్చింది. నెలకు రూ. 45,000 జీతం. అంతపెద్ద మొత్తం చేతిలో చూడటం.. అంటే.. తాను చేసిన పనికి అంత ప్రతిఫలం చూడటం అదే మొదటిసారి. మొదటి జీతం వచ్చిన రోజు.. అతని కళ్ళలో ఆనందం కనిపించింది. అతని మనసంతా పులకించిపోయింది. ఇన్నాళ్ళూ అమ్మ, నాన్నల నుండి చిన్న చిన్న అవసరాలకు వందా, రెండు వందలూ చేయిచాచి అడిగే వాడు. ఇప్పుడు ఏకంగా రూ.45,000 తన చేతుల్లో ఉంది. అదీ తన స్వార్జితం. అయితే, అంత జీతం ఏం చేసుకోవాలో కూడా స్టార్టింగ్ లో అర్థం కాలేదు. ఆ జీతం చూసిన ఆనందంలో ఎలా ఖర్చు చేయాలన్న విచక్షణ కోల్పోయాడు. అకౌంట్ లో ఇంత డబ్బుండగా ఖర్చు చేయడానికి ఆలోచన ఎందుకు? అనే భావన అతనిలోకి వచ్చేసింది.

# కలల కొలువు.. కొత్త ఉత్సాహం

కొత్త నగరం, కొత్త స్వేచ్ఛ, చేతి నిండా డబ్బు... ఇవన్నీ విక్రమ్‌ని వేరే లోకంలోకి తీసుకెళ్ళాయి. కానీ, అతనికి తెలియదు ఈ ఆర్థిక సుడి గుండంలో అడుగుపెట్టడం తేలిక, బయటపడడం చాలా కష్టమని.

### విలాసాల వలలో..

- మొదటి నెలలోనే ఐఫోన్ కొన్నాడు. దాని ధర లక్షా 20 వేల రూపాయలు. మొత్తం ఒకేసారి కట్టక్కర్లేదు కదా.. ఆ ఫోన్‌కి EMI పెట్టాడు. తను పనిచేసే ఆఫీసులో కొలీగ్స్ అందరూ అదే వాడుతున్నారు. కాబట్టి తనకూ అది ఉండాల్సిందే అనుకున్నాడు. అందుకే తన జీతంలోంచి ఫస్ట్ ఖర్చు ఐఫోన్ పై పెట్టాడు.
- రెండో నెల జీతం వచ్చింది. అకౌంట్ లో డబ్బులున్నాయ్. ఇప్పుడు వాడుతున్న బైక్ నార్మల్ అనిపించింది. అలా కాదు.. తన స్టేటస్ చూసేవాళ్లకు తెలియాలి కదా.. అందుకే బుల్లెట్ కొన్నాడు. దానికీ ఉందిగా EMI మంత్రం. మరో రూ.8,500 బుల్లెట్ EMIకి ఫిక్స్ చేసేశాడు.
- మూడో నెల... రెండు EMIలు కట్టాక కూడా అకౌంట్‌లో డబ్బులు వెక్కిరిస్తున్నాయ్. రూమ్‌లో రెండు పూటలా వంట అంటే టైమ్ వేస్ట్ అనుకున్నాడు. ఫోన్‌లో ఆర్డర్ చేస్తే నిమిషాల్లో డెలివరీ చేయగలిగే Zomato, Swiggy వంటి యాప్స్ ఉన్నాయ్ కదా... అంతే... వాటికి అడిక్ట్ అయిపోయాడు.
- నాలుగో నెల.. రూమ్‌లో ఓ స్మార్ట్ టీవీ ఉండాల్సిందే అని డిసైడయ్యాడు. దానిక్కూడా EMI సెట్ చేశాడు.
- ఐదో నెల... స్మార్ట్ టీవీ అయితే తీసుకున్నాడు. దానికి ఇంటర్నెట్ కనెక్షన్, డిష్ టీవీ, OTT subscriptions లేకుండా అది వృథా అనేది అర్థమయ్యింది. ఇంకే... అవి కూడా వచ్చేశాయి. Netflix, Amazon Prime, Hotstar, Sony LIV ఇలా క్రేజీ ఉన్నవన్నీ సబ్‌స్క్రిప్షన్ చేసుకున్నాడు.
- ఆరోనెల... ఆఫీస్‌లో మెట్రో సిటిజన్ లుక్ ఉండాల్సిందే అనుకున్నాడు. అప్పటిదాకా వాడుతున్నవి కాకుండా బ్రాండెడ్ డ్రెస్సెస్ షాపింగ్ చేశాడు. Louis Philippe చొక్కాలు, Levi's జీన్స్, Rare Rabbit బెల్టులు, Adidas షూస్.. ఇలా అతని లుక్కును పూర్తిగా మార్చేసుకున్నాడు.
- నెలలు గడుస్తున్నకొద్దీ విక్రమ్ తన స్టైల్, లైఫ్ స్టైల్ మార్చేసుకుంటున్నాడు. ఆ మార్గంలో ఆర్థిక అభిమన్యుడిలా మారిపోయాడు. ఎలాగంటే... విక్రమ్ నెలజీతం రూ.45,000, నెలవారీ ఖర్చులు, EMI లు చూసుకుంటే.. రూ.52,000, ఇక, పొదుపు మాట దేవుడెరుగు.. జీతం లోటు లేకుండా చూసుకుంటే బెటర్ అన్న స్టేజీకి వచ్చాడు. అయితే, ఆశ్చర్యమేంటంటే ఇవేమీ అతనికి అప్పటికి తప్పుగానో, దుబారా ఖర్చుగానో, అనవసర ఖర్చు గానో అనిపించలేదు. "ఈ నెల కాస్త ఎక్కువైంది, వచ్చే నెల చూసుకుందాం" అని తనకు తానే సర్దిచెప్పుకుంటున్నాడు. కానీ అలా మొత్తం బిల్లు కట్టే 'వచ్చే నెల' ఎప్పుడూ రాలేదు.. ప్రతి నెలా అదే కథ. పైగా.. లోటు పెరుగుతూ పోతోంది.

### అప్పుల పద్మవ్యూహం...

ఏడో నెలలో జేబు ఖాళీ అయింది. కొత్త ఖర్చు కోసం ఆలోచించడానికి కూడా ఏమీ లేదు. సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు కదా.. అప్పుడే బ్యాంకు నుండి క్రెడిట్ కార్డు ఇస్తామంటూ ఆఫర్ వచ్చింది. తన జీతానికి తగ్గట్టు లక్ష రూపాయల లిమిట్ ఇస్తామన్నారు. ఇంకేముంది.. అవసరానికి వాడుకోవచ్చని, క్రెడిట్ కార్డు తీసుకున్నాడు విక్రమ్.

స్టార్టింగ్‌లో చిన్న చిన్న ఖర్చులు. తర్వాత ఫ్రెండ్స్‌తో ట్రిప్స్. గోవా టూర్, వీకెండ్ కూర్గ్, ఇవన్నీ కూడా క్రెడిట్ కార్డుతోనే... బిల్లు వచ్చాక, వచ్చేనెల కట్టొచ్చులే.. అన్నది విక్రమ్ ఆలోచన. కానీ, జీతం బడ్జెట్ అంతే కదా... క్రెడిట్ కార్డు మినిమం Due మాత్రమే కట్టాడు. వడ్డీ రేటు యేడాదికి 36%. అవుట్‌స్టాండింగ్ రూ.80,000.

తొమ్మిదో నెలకు పరిస్థితి ముదిరింది. ఒక క్రెడిట్ కార్డు బిల్లు కట్టడానికి మరో క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. అదీ సరిపోలేదు. పర్సనల్ లోన్ తీసుకున్నాడు. విక్రమ్ అప్పుల కథ అంతటితోనే ఆగలేదు. ఫ్రెండ్స్ దగ్గర కూడా అప్పులు తీసుకున్నాడు. ఉద్యోగం వచ్చిన తొమ్మిది నెలల్లో విక్రమ్ మొత్తం అప్పు రూ.3.5 లక్షలు దాటింది. ఇలా విక్రమ్ 'అప్పుల పద్మ వ్యూహం'లో చిక్కుకున్నాడు. మహాభారతంలో అభిమన్యుడు తెలుసుకదా.. యుద్ధతంత్రంలో భాగమైన పద్మవ్యూహంలోకి ఎలా ప్రవేశించాలో తెలుసు. కానీ, ఆ పద్మవ్యూహం లోంచి ఎలా బయటపడాలో తెలియదు. ఇప్పుడు విక్రమ్ పరిస్థితి అచ్చం అలాగే ఉంది.

### నిద్ర పట్టని రాత్రులు...

పదో నెల.. తనకు జాబ్ వచ్చి పదినెలలయ్యింది. విక్రమ్ లైఫ్ తలకిందులైంది. మార్నింగ్ బ్యాంకు నుండి కాల్, మధ్యాహ్నం రికవరీ ఏజెంట్ మెస్సేజ్, ఈవెనింగ్ ఫ్రెండ్ నుంచి తనకు ఇవ్వాల్సిన అప్పు గురించి ఫోన్. ఈ పరిస్థితుల్లో తాను ఆఫీసులో కూడా పనిమీద అంతకుముందులాగా కాన్సన్ ట్రేట్ చేయలేకపోతున్నాడు. అమ్మకి చెప్పాలంటే భయం. ఫ్రెండ్స్‌కి చెప్పాలంటే అవమానం. తన పరిస్థితి గురించి ఎవరికీ చెప్పుకోలేక.. మానసికంగా కుంగిపోయాడు. రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. ఇంత తక్కువ జీతంతో అంత పెద్ద అప్పు ఎలా తీరుతుంది? అనే ఆలోచన వెంటాడుతోంది.

విక్రమ్‌కి అప్పటికి కానీ అర్థం కాలేదు. ఆర్థిక పద్మవ్యూహం లోకి ప్రవేశించడం తెలిసింది కానీ, అందులోంచి బయటపడే మార్గం తెలియలేదు. అప్పుడు భారతంలో అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకొని బయటకు రాలేదు. ఇప్పుడు తాను ఆర్థిక పద్మవ్యూహంలో బందీ అయిపోయాను. అనే కనువిప్పు కలిగింది. అప్పటినుంచీ తినడం తగ్గించాడు. ఎంటర్‌టైన్‌మెంట్ జోలికి వెళ్లడం లేదు. ఒంటరిగా గది నాలుగు గోడల మధ్య కూర్చుని లెక్కలు వేసుకున్నాడు. ఎంతగా ఆలోచించినా, ఏ విధంగా లెక్కించినా అప్పు తీరే దారి కనిపించడం లేదు. ఏ నిర్ణయం తీసుకోవాలో, ఏం చేయాలో పాలుపోని పరిస్థితి.

### అద్దంలో సమాజం...

విక్రమ్ కేవలం ఒక వ్యక్తి కాదు.. అతను ఈ తరానికి ప్రతినిధి. అంటే.. నేటి యువత లైఫ్ స్టైల్‌కు, అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నవాళ్లకు కూడా రిప్రెజెంటేటివ్. ప్రస్తుత సమాజంలో ఇలాంటి వాళ్లే ఎక్కువగా కనిపిస్తారు. మనదేశంలో సగటు పొదుపు రేటు కేవలం 10% నుంచి 15% మాత్రమే. అది కూడా క్రమంగా తగ్గిపోతోంది. 25 నుంచి 35 యేళ్ల వయసులో ఉన్న వాళ్లు దాదాపు 60% మంది క్రెడిట్ కార్డు అప్పుల్లో ఉన్నారు. ఇక, ఎమర్జెన్సీ ఫండ్ లేకుండా జీవించేవారు మనదేశంలో 75% పైనే కనిపిస్తారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో మరొకరి వెకేషన్ పోస్టులు చూసి... EMI పెట్టి మరీ తాము కూడా ట్రిప్ బుక్ చేసుకుంటున్నారు. పక్కింటి వాళ్లు కొత్త కారు కొంటే.. నెల తిరిగేలోపు మనమూ కొనాలి. ఆఫీసులో కొలీగ్ ఫారిన్ ట్రిప్ వెళ్లాడు. నెక్స్ట్ సమ్మర్ లో మనమూ వెళ్లాలి. ఇలా.. పక్కవాళ్ల జీవితాన్ని చూసి తమ జీవితాన్ని బేరీజు వేసుకొని నడుపుతున్నవాళ్లే ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు. "Yolo" (You Only Live Once జీవితం ఒక్కసారే ఉంటుంది) పేరుతో భవిష్యత్తు గురించి పట్టించుకోవడం మానేశారు. ప్రస్తుత క్షణాన్ని అనుభవించడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అయితే, ఇది దీర్ఘకాలంలో వ్యక్తిగత ఎదుగుదలకు, ఆర్థిక భద్రతకు, కెరీర్‌కు కూడా తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఇది ఒక్క విక్రమ్ సమస్య కాదు ఇది ఈ తరం సమస్య.

### మార్పు, మళ్ళీ జీవితం...

ఒకరకంగా డిప్రెషన్ స్టేజ్ లోకి వెళ్లిన విక్రమ్.. ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్‌గా నాగురించి తెలుసుకున్నాడు. తాను ఉన్న పరిస్థితుల్లో సొల్యూషన్ దొరుకుతుందేమో అని నన్ను కాంటాక్ట్ చేశాడు. అపాయింట్‌మెంట్ తీసుకొని 'ది రూపీ కంపెనీ'కి వచ్చాడు. ఎలాగూ పరిచయస్తుడిని కాదు కాబట్టి.. తన స్టోరీ మొత్తం చెప్పేశాడు. అతని పరిస్థితి మొత్తం అర్థమయ్యింది. అతని ఫైనాన్షియల్ సిచ్యుయేషన్ కారణంగా మెంటల్‌గా కూడా డిస్టర్బ్ అయ్యే స్టేజీకి వచ్చాడని అర్థమయ్యింది. నేను గ్రహించిన వాస్తవాలతో విక్రమ్‌కు కొన్ని సొల్యూషన్ టిప్స్ చెప్పాను. వాటిని నిజాయితీగా ఫాలో అయితే, కచ్చితంగా బయటపడతావని అతనికి అర్థమయ్యేలా వివరించాను. అంతేకాదు.. అతనికి ఓ 'టైమ్ ఫ్రేమ్' కూడా ఫిక్స్ చేశాను. నాక్కూడా ఆశ్చర్యమేసిందేంటంటే అతను నా గైడెన్స్‌ను తూచ తప్పకుండా ఫాలో అయ్యాడు. విక్రమ్ కమిట్‌మెంట్ కారణంగా నేను ఫిక్స్ చేసిన 'టైమ్ ఫ్రేమ్ లోపలే' బయటపడిపోయాడు.

### విక్రమ్ ఫాలో అయిన సొల్యూషన్స్

నన్ను కలిసి వెళ్లిన రోజు రాత్రే విక్రమ్ ప్లాన్ స్టార్ట్ చేశాడు. తనకు వచ్చే నెలజీతం, అప్పటికే పేరుకుపోయిన అప్పులు, ఖర్చులు, రోజువారీ లైఫ్ స్టైల్ అన్నీ నేను ఇచ్చిన ఒక నోట్‌బుక్‌లో రాసుకున్నాడు. వాటిని తీర్చడానికి ఏమేం మార్గాలున్నాయో కూడా తనకు అవగాహన ఉన్నంత వరకూ రాసుకున్నాడు. మరుసటిరోజే లీవ్ పెట్టి ఊరెళ్లాడు. అమ్మకు జరిగిందంతా చెప్పుకున్నాడు. ఇకపై ఇలా చేయనని కూడా మాటిచ్చాడు. సరికొత్త ఫైనాన్షియల్ ప్లాన్ ఫాలో అవుతున్నానని, అందులో ఫస్ట్ స్టెప్ నీదగ్గరికి వచ్చి ఆశీర్వాదం తీసుకుంటున్నానని చెప్పాడు. కొడుకు ఇంత తొందరగా తప్పు తెలుసుకొని మారుతుండటం గర్వంగా అనిపించింది. అమ్మ తాను చిట్టీవేసి పోగుచేసిన రూ.50,000 కొడుకు చేతిలో పెట్టింది. మరుసటిరోజే విక్రమ్ నాదగ్గరికి వచ్చాడు. సార్... గణేష్ గారూ.. మీ గైడెన్స్ సూపర్ సర్. ఫస్ట్ స్టెప్ సక్సెస్. అమ్మ రూ.50,000 ఇచ్చింది అన్నాడు. గుడ్ గోయింగ్.. కానీ, మళ్లీ నువ్వు ఎక్కడా ట్రాక్ తప్పకూడదు అని సున్నితంగా వార్నింగ్ ఇచ్చాను. అప్పుడే 'debt consolidation plan' సెట్ చేశాను. దాన్ని ఫాలో కావాలని సలహా ఇచ్చాను.అమ్మ ఇచ్చిన డబ్బులతో ముందుగా ఒక ఫ్రెండ్‌కు ఇవ్వాల్సిన అప్పు తీర్చాడు. తనకు అప్పటిదాకా ఉన్న subscriptions అన్నీ క్యాన్సిల్ చేశాడు. తన మొబైల్ లో ఫుడ్ డెలివరీ యాప్స్ డిలీట్ చేశాడు. వంట నేర్చుకున్నాడు. మరుసటినెల వచ్చేసరికి విక్రమ్‌లో కాన్ఫిడెన్స్ పెరిగింది. అప్పులన్నీ కలిపి ఒకే EMI గా మార్చేశాడు. ప్రతినెలా EMI కట్టడం, పొదుపు పాటించడం, అదనపు అప్పులు చేయకుండా ఒళ్లు దగ్గర పెట్టుకోవడం నేర్చుకున్నాడు. యేడాదిన్నరకే పూర్తిగా అప్పుల నుంచి ఫ్రీ అయ్యాడు. అప్పులనుంచి బయటపడిన ఆరోజు నా దగ్గరికి వచ్చినప్పుడు అతనిలో చూసిన సంతోషం ఇప్పటికీ నా కళ్లల్లో మెదులుతూనే ఉంది. ఎప్పటికీ ఉంటుంది కూడా... ఇకపై, ఆరోజే విక్రమ్ పొదుపు మొదలెట్టాడు. ఇదీ కలియుగపు ఆర్థిక అభిమన్యుడు విక్రమ్ కథ.

*- అట్లూరి గణేష్, ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్,*
***ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, రచయిత.***

# ఓటరు సవరణపై జాగ్రత్తగా ఉండాలి

- బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీకి సైనికుల్లా పనిచేయాలి
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి




**వరంగల్, మన చౌరాస్తా:** ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ పార్టీకి సైనికుడిలా పనిచేస్తూ ఓటర్ల జాబితాల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పిలుపునిచ్చారు. వరంగల్‌లోని ఎం.కె. నాయుడు హోటల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కేతూరి వెంకటేష్, షామీర్‌పేట్ రాజేష్ పాల్గొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బూత్ స్థాయి నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఓటర్ల జాబితాల సవరణ జరిగే ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం పోరాటం కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పుల సవరణ, తొలగించబడిన పేర్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటర్ల జాబితానే ఎన్నికల విజయానికి తొలి అడుగని, బూత్ బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోలింగ్ బూత్ ఏజెంట్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారమే లక్ష్యం

- జడ్పీ సీఈవో రంగారావు
- బండనాగారంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** మండలంలోని బండనాగారం గ్రామంలో లబ్ధిదారురాలు శివరాత్రి మమతకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో జడ్పీ సీఈవో రంగారావు సోమవారం నూతన గృహాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ఇజ్జగిరి రాములతో కలిసి ఇంటిని సందర్శించిన ఆయన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలిని అభినందించిన జడ్పీ సీఈవో, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సొంతింటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు అధికారులను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఇతర ఇందిరమ్మ గృహాల వివరాలను కూడా అధికారులు జడ్పీ సీఈవోకు వివరించారు.


# పొన్నంపై ఆరోపణలు సిగ్గుచేటు

- వెనక్కి తీసుకోకుంటే ఊరుకోం
- కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన వ్యాఖ్యలను మండల కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేస్తూ మంత్రి ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నించడం సిగ్గుచేటని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కేతిరి లక్ష్మారెడ్డి అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని, అలాంటి నాయకుడిపై అసత్య ప్రచారం చేయడం దురుద్దేశపూరిత చర్యేనని ఆయన విమర్శించారు. మంత్రి కుటుంబ సభ్యులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని, వెంటనే చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో గుర్తింపు కోల్పోయిన కొందరు వ్యక్తులు చౌకబారు రాజకీయాలకు పాల్పడుతూ ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలను సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో చిటంపల్లి ఐలయ్య, అశోక్ ముఖర్జీ, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, కోలుగూరి రాజు, ఆదరి రవీందర్, చంద్రశేఖర్ గుప్తా, సదానందం, ఊసకోయిల ప్రకాశ్, గుడికందుల రాజు, చిట్యాల అనిల్, కొమురయ్య, స్వరూప, స్రవంతి, బాలకృష్ణ, శ్రవణ్, గోపి, పోగుల శ్రీకాంత్, అనిల్, మధుసూదన్ పాల్గొన్నారు.

## ఏపీఎంఐడీ వైస్ చైర్మన్‌గా ఉపేందర్ గుప్తా



**రఘునాథపల్లి, మన చౌరాస్తా:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ (ఏపీఎంఐడీ) వైస్ చైర్మన్‌గా రఘునాథపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కూరెళ్ల పెద్ద ఉపేందర్ గుప్త నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. సంఘ సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంస్థ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణతో పాటు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభ్యున్నతి, వ్యాపారవేత్తల సంక్షేమం కోసం కృషి చేస్తానని చెప్పారు.

## విజయ డైరీ తమ్మడపల్లి అధ్యక్షుడిగా మల్లేశం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లి విజయ పాల డైరీ అధ్యక్షుడిగా మ్యాకల మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికలు జరిగినట్లు గ్రామ సర్పంచ్ బేజాడి సిద్ధులు తెలిపారు. డైరెక్టర్లుగా బేజాడి మధుకర్ రెడ్డి, అబ్బసాని కరుణాకర్, ఎలుగల శ్రీనివాస్, సానిక రాజు, ఎలుగల వెంకన్న, ఎలుగల మల్లేశం, మేడి చెలిమి బాల సిద్ధులు, కంసాని యాదగిరి రెడ్డి, ఎలుగల మల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మ్యకల మల్లేశం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం కృషి చేస్తూ, సభ్యుల సహకారంతో డైరీ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడతామని, సంఘం పురోగతికి అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులంతా సమష్టిగా కృషి చేసి విజయ పాల డైరీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన తెలిపారు.

## ప్రైవేట్ స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

**– ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్**



**స్టేషన్ ఘన్‌పూర్, మన చౌరాస్తా:** ఈ నెల 15 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టి, విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యాసంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారాయని విమర్శించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలల నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చి పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. అలాగే సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## అటుకుల్లో బొద్దింక..



**కొత్తకొండ, మన చౌరాస్తా :** కొత్తకొండలోని ఓ వైన్స్ సిట్టింగ్‌లో వినియోగదారులకు అందించిన అటుకుల్లో బొద్దింక కనిపించడంతో ఆదివారం కలకలం రేగింది. ఈ ఘటనపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆహార పదార్థాల పరిశుభ్రత విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సిట్టింగ్‌లో విక్రయించే తినుబండారాలను పరిశుభ్రంగా తయారు చేసి అందించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉన్నప్పటికీ, నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదని వారు వాపోయారు. అటుకుల్లో బొద్దింక కనిపించడం ఆహార భద్రతపై అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ ప్రక్రియలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి సిట్టింగ్‌లో పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించాలని, ప్రజారోగ్యానికి హాని కలగకుండా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**